సమాచారం

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: అత్వెల్లి,గుండ్లపోచంపల్లి సబ్ స్టేషన్లపరిధిలో చెట్ల నరికివేత కారణంగా నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు శశిధర్‌రెడ్డి,పవన్‌చందులు తెలిపారు. అత్వెల్లి సబ్ స్టేషన్ పరిధిలో అత్వెల్లి, లోటస్ ఎన్‌క్లేవ్, రాఘవేంద్రనగర్ కాలనీ,గుండ్లపోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఊర్జిత-1,2,మాణిక్య రెడ్డినగర్, లక్ష్మీనగర్,నైబర్‌హుడ్, ట్రిడెంట్ కాలనీలలో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సర ఫరా ఉండదని ఏఈలు తెలిపారు.

తైబజార్ వేలం పాట

కీసర: కీసర గ్రామ పంచాయతీ పరిధిలోని కీసరదాయర రహదారిలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతలో తైబజార్ రుసుము వసూలు చేసుకునేందుకు శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన తైబజార్ వేలం పాటను కీసర గ్రామానికి చెందిన చినింగని కిరణ్‌కుమార్ రూ.2,40,750లకు దక్కించుకున్నాడు. తైబజార్ దిక్కించుకున్న వ్యక్తి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు సంతలో చిరు వ్యాపారుల నుంచి తైబజార్ రుసుము వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని సర్పంచ్ నాయకపు మాధురి, గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డిలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెపా నూతన కమిటీ

మేడ్చల్: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీని మేడ్చల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా హనుమంత్‌రావు ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ నాయకుల సమక్షంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు.

గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించండి

కీసర: సీపీఎస్ ఉపాధ్యాయులంతా గుర్రం చెన్నకేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రాథమిక సభ్యులు శుక్రవారం కీసర మండల కేంద్రంలో సమావేశమయ్యారు. గత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డి, కూర రఘోత్తమ్‌రెడ్డి, అదేవిధంగా పట్టభద్రుల ఎన్నికల్లో సురభి వాణీదేవి, పల్లె రాజేశ్వర్‌రెడ్డిలు ఒక్కసారిగా సీపీయూ ఉద్యోగుల ఓట్లతోనే గెలిచారని చరిత్ర చెప్పిన వాస్తవమన్నారు. అదే ఐక్యతతో గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరి పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ సంఘం ప్రాథమిక సభ్యుల ప్రయోజనాల దృష్ట్యా పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి సంపూర్ణ మద్దతు పలుకుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రవూఫ్, రాష్ట్ర కార్యదర్శి శ్రవన్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి శివాజీ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ వంగేటి వెంకట్‌రెడ్డి, అసోషియేట్ అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి చంద్రశేఖర్, కుత్బుల్లాపూర్ మండలాధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

‘డిజైన్ థింకింగ్’తోనే మంచి భవిష్యత్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత సాంకేతిక యుగంలో వినూత్న ఆలోచనలు కొనసాగించడానికి ‘డిజైన్ థింకింగ్’ విధానం అనువైనదని, ఈ విధానంతో విద్యార్థులు తమ పరిశోధనలను మరింత ఉన్నతంగా నిర్వర్తించవచ్చని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సీఈఓ అభిజిత్‌రావు కటికనేని తెలిపారు. ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్ పైన నగర విద్యార్థులకు అవగాహన కల్పించడానికి శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్, టైటాన్, టింకర్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ‘డిజైన్ థింకింగ్ ఫర్ సోషల్ ఇంపాక్ట్’ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా సాంకేతిక–సామాజిక సమస్యలను పరిష్కరించడంలో ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్ పోషించే కీలక పాత్రపై అవగామాన కల్పించారు. సాంకేతిక ఆవిష్కరణలపై మన్‌దీప్ సింగ్, డిజైన్ థింకింగ్–బిజినెస్ ప్రాబ్లమ్స్ అంశంపై రవి ప్రత్యేక సెమినార్లను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో సంస్థ డైరెక్టర్ వాసుదేవ రావు యల్లపు, ప్రొఫెసర్ సీవీ టామీ, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.సీహెచ్.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, ఎస్ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో యూపీహెచ్‌సీ, యుక్త హాస్పిటల్ వారి సౌజన్యంతో మున్సిపల్ సిబ్బంది, వారి కుటుంబసభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కమిషనర్ రామకృష్ణా రావుతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన తక్షణమే పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ హెల్త్‌క్యాంపులో సమారు 170 మందికి రక్తపరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఎస్‌పిఓటు, ఈసీజీ పరీక్షలతో పాటు వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు.

ఏళ్లు గడుస్తున్నా.. ఎదురుచూపులేనా?



నగర శివారు పురపాలికలు, పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 3.85 లక్షలు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి 1,43,927 దరఖాస్తులు
- దాదాపు రెండున్నరేళ్ల కిందట స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల స్వీకరణ
- సిబ్బంది కొరతతో ముందుకుసాగని పరిశీలన
- దరఖాస్తుదారులకు తప్పని నిరీక్షణ

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లోని పురపాలికలు, గ్రామ పంచాయతీల్లో ఎస్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు మోక్షం లభించడం లేదు. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు. 2020 అక్టోబర్‌లో స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హతలున్న స్థలాలకు ఆమోదం తెలుపుతామని పేర్కొన్న సర్కారు.. నేటికీ ఆ ప్రక్రియ ముందుకు తీసుకెళ్లడం లేదు. ఏళ్లుగా అనధికారికంగా ఉన్న ప్లాట్లు, లేఅవుట్లు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఎస్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను తీసుకొచ్చింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ఇస్తామని బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. దీంతో ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న వారంతా ప్రభుత్వ ఆమోద ముద్ర కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

తప్పని నిరీక్షణ...

నగర శివారు జిల్లాలోని 29 పురపాలికల్లో ఎస్ఆర్ఎస్ కింద 3,85,674 దరఖాస్తులు వచ్చాయి. తొలివిడత ఫీజు రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తులు స్వీకరించారు. మిగతా ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉన్నా.. ఈ ప్రక్రియకు మోక్షం లభించకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ప్రకటించిన నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ కింద అనుమతి వస్తే భవనం నిర్మాణం చేపట్టడం, బ్యాంకు రుణాలు తీసుకోవాలని ఆశతో ఉన్న వారికి నిరాశే మిగులుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

క్రమబద్ధీకరణ క్రతువును టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్(టీపీబీఓ)లు చేపట్టాల్సి ఉంటుంది. వీరి తర్వాత టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) పరిశీలిస్తారు. ఆ తర్వాత టీపీఓ, కమిషనర్ అనుమతి మంజూరు చేస్తారు. కానీ తొలి, మలి ప్రక్రియ చేపట్టడానికి సిబ్బంది చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి రెండు జిల్లాలోని 29 పురపాలికల్లో ఈ విభాగంలో ఉద్యోగులు సరిపడా లేకపోవడం, ఉన్న వారికి వారానికి ఒక్కరోజు, రెండ్రోజులు మాత్రమే విధులు కేటాయిస్తుండటంతో వేల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం కష్టమవుతోంది.

భారీగా దరఖాస్తులు...

తెలంగాణ రాష్ట్రంలో మొత్తంగా 25 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా, నగర శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిల పరిధిలోని 7 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు, 297 గ్రామ పంచాయతీల నుంచి మొత్తం 3,85,674 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 29 పురపాలక సంఘాల నుంచి 3,74,447 దరఖాస్తులు రాగా, 297 గ్రామ పంచాయతీల నుంచి 11,227 దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలతో సహా 51 గ్రామ పంచాయతీల పరిధిలో 1,43,927 దరఖాస్తులు అందాయి. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని 3 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలతో పాటు 246 గ్రామ పంచాయతీ పరిధిలో 2,41,747 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి.

వీబీఐటీ వాలీబాల్ క్రీడాకారిణులకు అభినందనలు



క్రీడాకారిణులను అభినందిస్తున్న మనోహర్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞన భారతి ఇంజినీరింగ్ కలాశాల (వీబీఐటీ)లో వాలీబాల్ క్రీడాకారులను ఆ కళాశాల కార్యదర్శి జి.మనోహర్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. ఇటీవల మొయినాబాద్‌లో జరిగిన మహిళల వాలీబాల్ టోర్నమెంట్‌లో వీబీఐటీ వాలీబాల్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన సమావేశంలో వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఓడీ కల్యాణి, శివలాల్, విశ్వాస్ క్రీడాకారినులు పాల్గొన్నారు.

మహిళా విద్యా ప్రదాత సావిత్రీబాయి పూలే



జవహర్‌నగర్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతి

జవహర్‌నగర్: మహిళా విద్యా ప్రదాత, విద్యాభివృద్ధి, హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహిళ సావిత్రీబాయి పూలే అని జవహర్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్‌లో రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అలూరి రాజశేఖర్, బీఆర్ఎస్ పార్టీ జవహర్‌నగర్ కార్యదర్శి రెడ్డిశెట్టి మహేష్, తోట శ్రీనాథ్‌గుప్తా, రెడ్డిశెట్టి నాగరాణి, సవితగౌడ్, మౌనిక రెడ్డి, వనిత, మౌనిక, మేరీ, శ్యామల, సంపూర్ణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

మల్లాపూర్: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్ఎఫ్) ఈసీఐఎల్ విభాగం ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్లాపూర్ బ్రహ్మపురి కాలనీ శ్రీకరి మహాసన హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. భూకంపాలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సాయి బాబా, సెక్రటరీ రాధాకృష్ణ శర్మ, ప్రిన్సిపాల్ శేనాయ్ పర్కల్, డీఆర్ఎఫ్ వెహికల్ ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ కాకతీయనగర్ శ్రీమహంకాళి, శ్రీరామ దేవాలయంలో జరుగుతున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు, శ్రీ సీతా రామచంద్రస్వామి తిరు కల్యాణ మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం హబ్సిగూడలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ గాయం శ్రీధర్‌రెడ్డి, అర్చకులు గట్టు శ్రీనివాసచార్యులు, మల్లిఖార్జున శాస్త్రి, శ్రీనివాసాచారి, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, భాస్కర్ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, ప్రదీప్‌రెడ్డి, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



వెంకటకిషోర్

గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ గౌతంనగర్‌కు చెందిన బలిజేల్లి వెంకటకిశోర్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ హైదారాబాద్ అడ్వైజరీ ప్యానెల్ సభ్యులుగా నియమిస్తూ ఇటీవల నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వెంకట కిశోర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తానని తెలిపారు.

తెలంగాణలో మహిళలకు పెద్దపీట

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



కేక్ కట్ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి కోడళ్లు

మేడ్చల్: రాష్ట్రంలో మహిళల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళల కోసం ప్రత్యేకంగా డిగ్రీ, లా కళాశాలలు ఏర్పాటు చేశామని, విదేశీ విద్య కోసం రూ.20 లక్షల సహాయం అందజేస్తున్నామన్నారు. మహిళలు లేనిది తాము లేమని, మహిళా శక్తి వల్లే తాము ఈ స్థానాల్లో ఉన్నామన్నారు. మహిళల త్యాగాలు మరువలేమని, ఆడ పిల్లలను బాగా చదివించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో మహిళలకు వివిధ రకాల క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో...

మహిళా దినోత్సవంను పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో మంత్రి మల్లారెడ్డి కోడళ్లు ప్రీతిరెడ్డి, శాలినీరెడ్డిలు సందడి చేశారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మహిళతో కలిసి కేక్ కట్ చేశారు. ఇందులో భాగంగా మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు వివిధ రంగాల్లో ఉన్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శైలజ విజయానంద్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, అధికారులు అర్చన, హైమావతి, మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

నల్లా నరసింహారెడ్డి కళాశాలలో...

ఘట్‌కేసర్: చౌదరిగూడలోని నల్లా నరసింహారెడ్డి కళాశాలలో ఫార్మా సంప్రతిలో భాగంగా శుక్రవారం కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా దుస్తులు ధరించి సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, హెచ్ఓడీలు, డీన్స్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ జెడ్పీ బాలికల పాఠశాలలో...

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో ఆ పాఠశాల మహిళా ఉపాధ్యాయులను మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ సన్మానించారు. కౌన్సిలర్ నస్రీన్ సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్



నల్లా నరసింహారెడ్డి కళాశాలలో వేడుకలు

వేతనాల కోసం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మేడ్చల్: గ్రామ పంచాయతీల్లో నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. నాలుగు నెలలుగా తమకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు ఎందుకు వేతనాలు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, అందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కలిపించాలని కోరారు. ధర్నా అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మున్నికృష్ణ, శ్రీనివాస్, సుధాకర్, రాములు, జానకి, మల్లమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న కొండల్‌రెడ్డి, ఐలయ్యయాదవ్

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్ రెడ్డి, ఉపసర్పంచ్ ఐలయ్యయాదవ్, రైతుబంధు జిల్లా సభ్యుడు బిక్షపతిగౌడ్ శుక్రవారం చెక్కులు అందజేశారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందిన అవుషాపూర్‌కు చెందిన భాస్కర్‌కు రూ.30వేలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, నాయకులు మోహన్‌రెడ్డి, శ్యామ్‌రావు, బాబుగౌడ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

జవహర్‌నగర్: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు పథకంను విజయవంతంగా కొనసాగిస్తోందని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. కార్పొరేషన్ 10వ డివిజన్‌లో జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గండి రామచందర్, బింగి లావణ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమ్తుల్ అజీజ్, వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ కావ్య

యువ మేధస్సులోని ప్రతిభను ఆవిష్కరించడం టెక్నో ఫెస్ట్ లక్ష్యం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రశాంత్

ఘట్‌కేసర్: యువ మేధస్సులోని ప్రతిభను ఆవిష్కరించడం టెక్నో లక్ష్యమని హైదరాబాద్ హిటాచీ వంటారా టాలెంట్ అక్విజిషన్ మేనేజర్ నిడమర్తి ప్రశాంత్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో జాతీయ స్థాయి టెక్నో ఫెస్ట్ ధక్ష 2కె23 ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయి టెక్నోలు విద్యార్థులు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అనంతరం టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్ల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపకులపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ సమీనా ఫాతిమా, సీఈఓ నీలిమా, కన్వీనర్ అనిల్ కుమార్, కోకన్వీనర్ రవిరాజు, ఏయూ హెడ్‌లు, డీన్స్, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరంగవరంలో కంటి వెలుగు ప్రారంభం



శిబిరంలో పరీక్షల తీరు పరిశీలిస్తున్న దృశ్యం

మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ శైలజావిజయానంద్‌రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డిలు సర్పంచ్ విజయానంద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. గ్రామ ప్రజలంతా శిబిరానికి విచ్చేసి కంటి పరీక్షలు చేసుకుని, అవసరమైన వారు కంటి అద్దాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రకాష్, నాయకులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

‘రాష్ట్రంలో అంధత్వం పారదోలేందుకే కంటి వెలుగు’

ఘట్‌కేసర్: రాష్ట్రంలో అంధత్వం పారదోలేందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 12వ వార్డులో మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డితో కలిసి శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్ పద్మారావు, పీహెచ్ఎన్ విమలరెడ్డి, అప్తమాలజిస్ట్ శిరీష, డీఈఓ సాత్విక్, వైద్యసిబ్బంది విజయ, రాజేశ్వరీ, లక్ష్మీ, మేఘమాల పాల్గొన్నారు.



కంటి వెలుగును పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ వేమనరెడ్డి

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు సాంకేతికతను వివరించాలి



పాఠశాలను సందర్శించిన కమ్యూనికేషన్ విభాగం

కీసర: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు నూతన సాంకేతిక, దానికి సంబంధించిన అప్లికేషన్లపై అవగహన కల్పించాలని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చీర్యాలలోని గీతాంజలి కళాశాల కమ్యూనికేషన్ విభాగం విద్యార్థులు చీర్యాలలోని ఎంపీపీఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, తయారు చేసిన ప్రాథమిక మోడళ్లపై సోదాహరణంగా రవీందర్‌రెడ్డి విపులీకరించారు. అనంతరం ప్రాజెక్టు మోడళ్లను ప్రదర్శించగా విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, ఓడయ్య, శ్రీలత, సౌజన్య, డా.వల్లతాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘పస్తులతో పనులు ఎలా చేస్తారు?’



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: పస్తులతో పారిశుద్ధ్య పనులు ఎలా చేస్తారని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు యాదయ్య, సబిత ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం చేపట్టిన ఒక రోజు నిరహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. యాద య్య, సబిత మాట్లాడుతూ.. మల్టీపర్పస్ ఉత్తర్వును ఎత్తివేయాలని, రూ.25 వేల కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మేడ్చల్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ బలపరిచిన అభ్యర్థి తరుపున మండల బీజేపీ నాయకులు వివిధ పాఠశాలలో ప్రచారం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కళాశాలలో బీజేపీ నాయకులు టీచర్లను కలిసి కరపత్రాలు అందజేసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, జాకట ప్రేమ్‌దాస్, రాఘవరెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రచారం చేస్తున్న దృశ్యం

వంద శాతం పన్నుల వసూలుకు చర్యలు

కీసర: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు వంద శా తం పన్నులు వసూలు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని మండల ఎంపీఓ మంగతాయారు అన్నారు. శుక్రవారం వివిధ గ్రామాల్లో పంచాయతీ బిల్‌కలెక్టర్లు పన్నుల వసూలు నిమిత్తం నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌ను ఆమె పరిశీలించారు.